నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 29 మే 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## లబ్ధిదారులందరికీ పౌష్టికాహారం అందజేస్తాం


సమస్యలు తెలుసుకుంటున్న చిన్నయ్య

రామకృష్ణాపూర్, మే 28: అంగన్‌వాడీ కేంద్రం ద్వారా లబ్ధిదారులందరికీ పౌష్టికాహారం, సేవలు అందజేస్తామని మంచిర్యాల జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్య అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలోని 2వ వార్డు ప్రజలకు సుభాష్‌నగర్ 2 అంగన్‌వాడీ సెంటర్‌ను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరితతో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. సుభాష్‌నగర్‌లోని అంగన్‌వాడీ సెంటర్ జ్యోతినగర్ ప్రజలకు దూరంగా ఉండడం వల్ల పౌష్టికాహారం, రేషన్ అందడం లేదని కౌన్సిలర్ సుధాకర్ ఫిర్యాదు మేరకు తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్‌ను పిలిపించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ అనుమతితో జ్యోతినగర్‌లో సెంటర్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకు సంబంధించిన రిపోర్టు ఇవ్వాలని సూపర్‌వైజర్ సరితను ఆదేశించారు. అప్పటివరకు జ్యోతినగర్‌లోని లబ్ధిదారులందరికీ పౌష్టికాహారం, సేవలు అందించాలని ఆదేశించారు. సమస్యపై వెంటనే స్పందించిన జిల్లా సంక్షేమ అధికారి, సూపర్‌వైజర్, వార్డు ప్రజలు, కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

**మంచిర్యాల డీఏవో సురేఖ**


ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న డీఏవో సురేఖ

నెన్నెల, మే 28: కల్తీ, నకిలీ, నిషేధిత విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఫర్టిలైజర్ షాపుల డీలర్లను మంచిర్యాల జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ హెచ్చరించారు. మంగళవారం నెన్నెల మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో ఆమె తనిఖీలు చేశారు. ఎరువుల గోదాములు, విత్తన ప్యాకెట్లను పరిశీలించారు. దుకాణాల్లో స్టాక్ రిజిష్ట్రర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలన్నారు. కల్తీ, నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కేసులు తప్పవని హెచ్చరించారు. ఎరువులు, విత్తనాలు విక్రయించిన వెంటనే రసీదులు ఇవ్వాలన్నారు. అనంతరం మైలారం, జోగాపూర్ గ్రామాల్లో రైతులకు విత్తనాలపై అవగాహన కల్పించారు.


**● విత్తన వెతలు**


ఆదిలాబాద్ పట్టణంలోని దుకాణాల ఎదుట విత్తనాల కోసం బారులుదీరిన రైతులు

# రైతుల గుండెల్లో విత్తన గుబులు

## పత్తి ఇత్తుల కోసం దుకాణాల ఎదుట భారీ బారులు

- వేకువ జాము నుంచే పిల్లలు, వృద్ధులు, మహిళల క్యూ
- విత్తనాలు వచ్చాయని తెలియడంతో తరలివచ్చిన రైతులు
- మండుటెండలో దాదాపు నాలుగు గంటలపాటు పడిగాపులు
- పోలీసు బందోబస్తు మధ్య రెండు ప్యాకెట్ల చొప్పున పంపిణీ
- విత్తనాలు దొరకక నిరాశతో వెనుదిరిగిన కొందరు రైతన్నలు
- కాంగ్రెస్ హయాంలో పదేండ్ల క్రితం నాటి బారులు దర్శనం


క్యూలైన్‌లో నిల్చొని అలిసిపోయిన మహిళా రైతు పోసాని

“ కాంగ్రెస్ సర్కారు వచ్చిందో లేదో అలా కష్టాలు మొదలయ్యాయి. రాంగ రాంగనే అవస్థలను మోసుకొచ్చింది. వానకాలం ప్రారంభం కాక ముందే రైతన్నలకు విత్తనాల కోసం చుక్కలు చూపిస్తున్నది. ఈ పాటికే స్టాక్ పెట్టి, సజావుగా అందించాల్సిన హస్తం సర్కారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నది. అవసరమైన విత్తనాలను సరిపడా అందుబాటులో ఉంచకపోవడంతో రైతన్నలు గుబులు చెందుతున్నారు. వారం రోజుల్లో రుతుపవనాలు వస్తాయని, వర్షాలను మోసుకొస్తాయని వాతావరణ శాఖ తీపి కబురు అందిస్తుండగా.. విత్తనాల కోసం దుకాణాల వద్దకు రైతులు పరుగులు పెడుతున్నారు. ఎండనకా.. వాననకా వేకువజాము నుంచే గంటల తరబడి బారులుదీరుతున్నారు. దుకాణాదారులు కూడా స్టాక్ తక్కువగా రావడంతో వచ్చిన విత్తనాలను పంపిణీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. తాజాగా మంగళ వారం స్టాక్ వచ్చిందని తెలిసిన వెంటనే రైతులు దుకాణాల వద్దకు తరలివచ్చారు. పెద్ద సంఖ్యలో రైతులు తరలిరావడంతో పోలీసు బందోబస్తు మధ్య విత్తనాలను పంపిణీ చేశారు. వ్యాపారుల వద్ద ఉన్న విత్తనాలను రెండేసి ప్యాకెట్ల చొప్పన పంపిణీ చేయగా.. కొందరు రైతులకు అందకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

ఆదిలాబాద్, మే 28(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా పత్తి విత్తనాల కోసం రైతులు గోస పడుతున్నారు. 280 మంది డీలర్ల వద్ద వివిధ కంపెనీలకు చెందిన చెందిన ఆరు లక్షల బీటీ పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు చెబుతున్నప్పటికీ అవసరమైన వాటి కొరత ఉంది. జిల్లాలో ఈ ఏడాది వానకాలంలో 4 లక్షల ఎకరాల్లో పత్తి సాగువుతుండగా.. 10 లక్షల విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని అధికారులు అంటున్నారు. రైతులు భూములు, వర్షాలు, వాతావరణ పరిస్థితులు, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని విత్తనాలను ఎంపిక చేసుకుంటారు. ఆర్‌సీహెచ్ 659 విత్తనాల ద్వారా ఆశించిన దిగుబడి వస్తుండడంతో రైతులు వీటిని కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది వానాకాలానికి భూములను సిద్ధం చేసుకున్న రైతులు విత్తనాల సేకరణలో పడ్డారు. ఇతర కంపెనీల బీటీ-2 విత్తనాలను తీసుకునేందుకు ఇష్టపడడం లేదు. వారం రోజుల నుంచి వారికి కావాల్సిన విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారు.


విత్తనాల దుకాణం వద్ద లైన్‌లో నుంచి తప్పుకొని ముందుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న రైతును వెనక్కి లాక్కెళ్తున్న పోలీస్ అధికారి

### భారీగా తరలివచ్చిన రైతులు


రైతుల డిమాండ్ మేరకు వ్యవసాయశాఖ అధికారులు ఆర్‌సీహెచ్ 659 విత్తనాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం 27 వేల విత్తన ప్యాకెట్ల స్టాక్ రాగా.. జిల్లా వ్యాప్తంగా పలు దుకాణాల్లో విక్రయాలు జరిగాయి. విత్తనాలు వచ్చిన విషయం తెలుసుకున్న రైతులు ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి భారీ సంఖ్యలో తరలివచ్చారు. పట్టణంలోని 13 వేల విత్తన ప్యాకెట్లను విక్రయించడానికి చర్యలు తీసుకున్నామని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు. రైతుల రాకతో దుకాణాల్లో భారీ రద్దీ నెలకొన్నది. వందల సంఖ్యలో రైతులు క్యూలో నిలబడ్డారు. విత్తనాల పంపిణీ సందర్భంగా ఆందోళనలు జరగకుండా పోలీసులు పంపిణీ కేంద్రాలకు చేరుకున్నారు. వ్యాపారులు పోలీసు బందోబస్తు మధ్య పంపిణీ చేశారు. అధికారులు విత్తనాల పంపిణీ ప్రారంభించినా రైతులకు సరిపడా అందలేదు. ప్రతి రైతుకు రెండు ప్యాకెట్లను మాత్రమే ఇచ్చారు. మూడు, నాలుగు గంటలు మండుటెండలో పడిగాపులు కాశారు. కొన్ని దుకాణాల్లో గంట వ్యవధిలోనే వ్యాపారులు అమ్మకాలను పూర్తి చేశారు. తమకు వచ్చిన స్టాక్ మేరకు అమ్మకాలు జరిపామని పేర్కొన్నారు. దీంతో క్యూలైన్‌లో నిల్చున్న రైతులు నిరాశతో వెనుదిరుగాల్సిన పరిస్థితి నెలకొన్నది. పది ప్యాకెట్లు అవసరమున్న రైతులకు రెండు మాత్రమే లభించడంతో వారు నిరాశతో వెనదిరిగారు. మరో పది రోజుల్లో వర్షాలు పడే అవకాశాలున్నాయని చినుకు పడగానే తాము విత్తనం వేస్తామని, తమకు సరిపడా విత్తనాలు అందకపోతే ఏమి చేయాలని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### లాఠీచార్జి జరపలేదు..

**ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం**

ఎదులాపురం, మే 28 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పత్తి విత్తనాల కొనుగోలు కోసం వచ్చిన రైతులపై లాఠీచార్జి జరపలేదని ఎస్పీ గౌష్ ఆలం ఒక ప్రకటనలో తెలియజేశారు. రైతుల బాగు కోసం అపాయం జరగకుండా రైతులందరినీ ఒక క్రమబద్ధీకరణతో ఉంచడానికి విధులు నిర్వర్తిస్తుంటారనే విషయాన్ని గ్రహించాలన్నారు. ఎటువంటి ఆందోళనకర పరిస్థితులు ఆదిలాబాద్‌లో ఏర్పడలేదన్నారు. ఆందోళనకర అవాస్తవ వార్తలను ప్రచురించి, ప్రశాంతమైన రైతులకు ఇబ్బందికర పరిస్థితిని తీసుకురాకూడదన్నారు. అవాస్తవమైన వార్తలు, ట్రోలింగ్‌లను ప్రచురించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### మూడు గంటలు నిలబడ్డా.. ఇత్తులు దొరుకలే..



నాపేరు ప్రవీణ్. నాకు ఆదిలాబాద్ జిల్లాలోని కప్పర్ల గ్రామంలో ఏడెకరాల వ్యవసాయ భూమి ఉంది. నేను యేటా వానకాలంలో పత్తి విత్తనాలు వేస్తా. ఆదిలాబాద్‌కు నాలుగు రోజుల నుంచి విత్తనాల కోసం తిరుగుతున్నా. రాకపోవడంతో వెనుదిరిగి ఇంటికొస్తున్నా. మంగళవారం విత్తనాలు వచ్చాయని మా ఊరు నుంచి ఉదయం ఎనిమిది గంటలకు వచ్చి దుకాణం ఎదుట నిలబడ్డా. నా కంటే ముందుగానే చాలా మంది రైతులు రావడంతో లైన్ పెద్దగా ఉంది. పది గంటలకు అమ్మకాలను ప్రారంభించిన వ్యాపారి గంటలోనే అయిపోయాయని చెప్పిండు. నావరకు రాకుండానే విత్తనాలు అయిపోయాయి. మూడు గంటలు లైన్‌లో నిల్చున్నా దొరకలేదు. వ్యాపారిని అడిగితే మాకు సప్లయి తక్కువగా ఉంది. వచ్చిన విత్తనాలు అమ్మేశామని చెప్పిండు. ఇగ మా బాధ ఎవరికీ చెప్పుకోవాలి. విత్తనాల కోసం రైతులు గోస పడడం పదేండ్ల క్రితం చూసిన. ఇప్పుడు మళ్లీ చూస్తున్న. కేసీఆర్ ఉన్నప్పుడు ఎప్పుడు విత్తనాల కోసం ఇంత గోస పడలేదు. ఈ కాంగ్రెస్ సర్కారోళ్ల కాలంలో మస్తు ఇబ్బంది పడుతున్నం. అధికారులు స్పందించి అవసరమైన విత్తనాలను పంపిణీ చేయాలి. లేకపోతే రైతులు భారీగా నష్టపోయే ప్రమాదం ఉంది.

## ఐదున్నర క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

చెన్నూర్ టౌన్, మే 28 : నకిలీ పత్తి విత్తనాలను సరఫరా చేస్తున్న ఇద్దరిని టాస్క్ ఫోర్స్ పోలీసులు చెన్నూర్‌లో మంగళవారం అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కర్ణాటక నుంచి నిషేధిత (బీటీ 3) విత్తనాలు మహారాష్ట్ర మీ దుగా సరఫరా చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు సీపీ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సంజయ్, ఎస్‌ఐ లచ్చన్న, సిబ్బందితో కలిసి చెన్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బతుకమ్మ వాగు వద్ద ఐచర్ వ్యాన్‌ను ఆపి తనిఖీ చేశారు. వాహనంలో పైన ఉల్లిగడ్డ బస్తాలు వేసుకొని వాటికింద సుమారు రూ.16.50 లక్షల విలువైన 5.5 క్వింటాళ్ల ప్రభుత్వ నిషేధిత (బీటీ-3) పత్తి విత్తనాలను గుర్తించారు. లక్షెట్టిపేట మండలం కొత్తూరుకు చెందిన డ్రైవర్, క్లీనర్ సొల్లు పెద్దయ్య, సొల్లు హరికుమార్ అదుపులోకి తీసుకొని విచారించారు. విత్తనాలను గుంటూరులోని సుబ్బారావు వద్ద తక్కువ ధరకు కొని ఇక్కడ అధిక ధరకు విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు అంగీకరించారు. 5.5 క్వింటాళ్ల నిషేధిత పత్తి విత్తనాలు, రూ.1,80,000 నగదు, మూడు మొబైల్స్, ఐచర్ వ్యాన్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించా రు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. టాస్క్ ఫోర్స్ అధికారులు, సిబ్బందిని అభినందిస్తూ సీపీ రివార్డులు అందించారు. మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్, అదనపు డీసీపీ అడ్మిన్ సీ.రాజు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూర్ ఎస్‌ఐ రవీందర్, టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సంజయ్, అగ్రికల్చర్ ఏవో గ్లాడ్సన్ పాల్గొన్నారు.

### దిందా గ్రామంలో నకిలీ విత్తనాలు

చింతలమానేపల్లి , మే 28 : మండలంలోని దిందా గ్రామంలో ఓ ఇంట్లో నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నట్లు ఎస్‌ఐ నరేశ్ తెలిపారు. దిందా గ్రామంలో నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారని సమాచారం అందగా సీఐ సాధిక్ పాషా ఆధ్వర్యంలో చింతలమానేపల్లి పోలీసులతో కలిసి పలు ఇండ్లల్లో తనిఖీ చేశారు. డగె తిరుపతి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 10 కిలోల నకిలీ విత్తనాలు లభించాయి. శివుడు అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసినట్లు తిరుపతి తెలిపాడు. ఏవో రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



పట్టుకున్న నకిలీ పత్తి విత్తనాలు, వ్యాన్‌తో సీపీ, పోలీసులు

## వారంలో కొనుగోళ్లు పూర్తి చేయాలి

**మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్**

చెన్నూర్ రూరల్, మే 28: చెన్నూర్ మండలంలో వారంలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని అధికారులు, సెంటర్ల నిర్వాహకులను మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. చెన్నూర్ మండలంలోని ఆస్నాద్, ఒత్కులపల్లి, సోమన్‌పల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. మిల్లర్లతో మాట్లాడి లారీల కొరత లేకుండా చూడాలని తెలిపారు. ధాన్యం తూకంలో రైతులను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ మల్లికార్జున్, ఆర్‌ఐ రంజిత్ కుమార్, ఏఈవో సాగర్ ఉన్నారు.

### నకిలీ విత్తనాల విక్రయాన్ని అరికట్టాలి

నస్పూర్, మే 28 : జిల్లాలో నకిలీ విత్తనాల విక్రయాలు, కృత్రిమ ఎరువుల కొరతను అరికట్టే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయాధికారి సురేఖ, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోకి వరి ధాన్యం, నకిలీ విత్తనాలు తీసుకురాకుండా చర్యలు తీసుకోవాలని, అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద, నది మార్గాల్లో తనిఖీలు చేపట్టాలన్నారు.

## ఓట్ల లెక్కింపును పకడ్బందీగా నిర్వహించాలి

- కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్ /నస్పూర్, మే 28: లోక్ సభ ఎన్నికలకు సంబంధించి జూన్ 4న చేపట్టనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, అందుకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి అదనపు ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సజావుగా, ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా నిర్వహించాలన్నారు. జూన్ 6 వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందన్నారు. అధికారులు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, విద్యుత్, ఇంటర్నెట్ ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. ఓఆర్‌ఎస్, వైద్య సదుపాయం, మందులను అందుబాటులో ఉంచాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రంలోకి సరైన అనుమతి లేని వారిని, మొబైల్ ఫోన్‌లను అనుమతించవద్దన్నారు.

### ఏర్పాట్లు పూర్తి : మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి జిల్లాలోని హాజీపూర్ మండలంలోని ముల్కల్ల ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కంట్రోల్‌రూం, మీడియా సెంటర్లను ఏర్పాటు చేశామని, ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే సిబ్బందికి శిక్షణ ఇచ్చామని తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో డీసీపీ అశోక్‌కుమార్, అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్, ఆర్డీవో రాములు, ప్రత్యేక ఉప పాలన అధికారి చంద్రకళ, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### శిక్షణ ఇచ్చాం : కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఎస్పీ సురేశ్ కుమార్, జిల్లా అదనపు కలెక్టర్, సిర్పూర్ అసెంబ్లీ సెగ్మెంట్ సహాయ ఎన్నికల అధికారి దీపక్ తివారీ, ఆసిఫాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ సహాయ ఎన్నికల అధికారి దాసరి వేణుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపునకు ఆదిలాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కౌంటింగ్‌పై అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.



వీసీలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

### కౌంటింగ్ అధికారులు, సిబ్బందికి శిక్షణ..

జూన్ 4న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఓట్ల లెక్కింపులో పాల్గొనే సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సిర్పూర్, ఆసిఫాబాద్ సహాయ ఎన్నికల అధికారులు దీపక్ తివారీ, దాసరి వేణుతో కలిసి కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే హాజరై పలు సూచనలు చేశారు. ఓట్ల కౌంటింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రంలోకి అనధికార వ్యక్తులకు అనుమతి లేదని, ప్రతి ఒక్కరూ గుర్తింపు కార్డు ధరించాలని చెప్పారు. సిర్పూర్ నియోజకవర్గానికి 14 టేబుళ్లు, 23 రౌండ్లు, ఆసిఫాబాద్‌కు 16 టేబుళ్లు, 23 రౌండ్లు ఉంటాయని వెల్లడించారు. సందేహాలుంటే సహాయ ఎన్నికల అధికారిని అడిగి తెలుసుకోవాలని సూచించారు.

• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• పదవీ విరమణ
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• షష్టిపూర్తి మహోత్సవం
మరియు
• అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679